క్లుప్తంగా

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఓర్వకల్లు: బదిలీపై అనంతపురం జిల్లాకు వెళుతున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్‌ను మంగళవారం పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. నాలుగేళ్ల కాలంలో ఆయన చేసిన సేవలను పలువురు పంచాయతీ కార్యదర్శులు కొనియాడారు. జగనన్న హౌసింగ్ లేఅవుట్ల విషయంలో మండలాన్ని జిల్లాలోనే అగ్రస్థానంలో నిలపడంలో కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. ఈఓఆర్డీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం



త్యాగరాజ స్వామి ఊరేగింపు

పాణ్యం: నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో పాణ్యంలో త్యాగరాజస్వామి 177వ ఆరాధన మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యే పూజలు చేశారు. అనంతరం త్యాగరాజస్వామి చిత్రపటాన్ని మేళతాళాల నడుమ పట్టణంలో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పాణ్యం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ముందుగా గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రతాప్, వెంకటాద్రి పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ





ప్రమాదంలో గాయపడిన వ్యక్తి, దెబ్బతిన్న ఆటో

పాణ్యం: ఆటోను లారీ ఢీకొనడంతో వ్యక్తి గాయపడిన ఘటన పాణ్యంలోని డొంగు వద్ద మంగళవారం రాత్రి జరిగింది. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించినట్లు హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఎస్ఐ బదిలీ ఆపాలి

కోడుమూరు: కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులును బదిలీని ఆపాలని కోరుతూ మంగళవారం స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో సీపీఐ, సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం నేతలు క్రిష్ణ, రాజు, వీరన్న మాట్లాడుతూ కోడుమూరులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు నిజాయితీగా విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతల విషయంలో నిక్కచ్చిగా వ్యవహరిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు బదిలీని ఉన్నతాధికారులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఎస్ఐగా శ్రీనివాసులు 8 నెలలు మాత్రమే పనిచేశారని, మరికొంత కాలం పాటు కొనసాగించాలని వారు కోరారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుండి కేసీ కాల్వకు మంగళవారం 159 క్యూసుక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యామ్ అధి కారులు తెలిపారు. డ్యామ్‌లో 0.438 టీఎంసీల నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేయండి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.31.59 కోట్లను మార్చి నెలాఖరు నాటికి ఖర్చు చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు ఆదేశించారు. ఈ నిధులను నిర్ణీత సమయంలోగా ఖర్చు చేస్తే 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధులు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. మంగళవారం ఆయన తన చాంబర్ నుంచి జిల్లాలోని ఈఓఆర్డీలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటి వరకు ఆయా గ్రామ పంచాయతీల్లో తాగునీరు, పారిశుద్ధ్యం అవసరాలకు వెచ్చించిన ఖర్చుతో పాటు పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులకు ఈ నిధులను ఉపయోగించుకోవాలన్నారు. అలాగే గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రకారం చేపట్టాల్సిన పనుల వివరాలను ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

- ఆసరా కింద 834 సంఘాలకు రూ.5.30 కోట్లు విడుదల
- వైఎస్సార్‌సీపీ హయాంలో అతివలకు అందలం
- మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందాం
- హుసేనాపురం పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే కాటసాని
- ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



పేదలకు పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఎస్సీ కాలనీలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఓర్వకల్లు: రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయనతో పాటు కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, సింగిల్ విండో చైర్మన్ నాగ తిరుపా, సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పావులా వడ్డీకే పొదుపు మహిళలకు రుణాలు అందజేసి లక్షాధికారులను చేయాలనుకుంటే, అదేస్ఫూర్తితో ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు మహిళలకు మరింత తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఇళ్ల పట్టాలు వంటి పథకాలను అమలు చేశారని తెలిపారు. ఈ పథకాల ద్వారా ఏటా ఒక్కో సభ్యురాలికి కనీసం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరిందని చెప్పారు. గత టీడీపీ హయాంలో పొదుపు రుణాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. పసుపు కుంకుమ పేరుతో రూ.10 వేలు చెల్లించి మహిళలను మభ్యపెట్టిన విషయం మరచిపోవద్దని గుర్తుచేశారు. అసలు చంద్రబాబు పాలనలో వర్షాలు కురవక, ప్రజలు కరువు కాటకాలతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఎద్దేవా చేశారు. మళ్లీ అలాంటి దుర్భిక్ష పరిస్థితులు రాకూడదనుకుంటే టీడీపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

దశల వారీగా పొదుపు రుణాలు రద్దు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మండలంలో 834 డ్వాక్రా సంఘాలకు ఏటా రూ.5.30 కోట్ల పొదుపు రుణాలను రద్దు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అలాగే 45 ఏళ్లు పైబడిన మహిళలకు ప్రతి ఏడాది చేయూత పథకం కింద రూ.18,750 చెల్లించి ఆర్థిక చేయూతను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

స్థానిక ఎస్సీ కాలనీలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. దీనిపై కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. తాను కబ్జాలకు పాల్పడినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. వాస్తవాలను తెలుసుకోకుండా మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చాందుబాష, కాల్వబుగ్గ దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్ చిన్న అయ్యన్న, నాయకులు జీకే వెంగన్న, చంద్రపెద్దస్వామి, గోపా వెంకట రమణారెడ్డి, రామేశ్వరరెడ్డి, గోపా రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రబీ సాగుపై అవగాహన కల్పించండి



పదవీ విరమణ చేయనున్న జయదేవ్‌ను సత్కరిస్తున్న వ్యవసాయ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): రబీలో నీటి వనరుల కింద సాగు చేసిన వివిధ పంటలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సూచించారు. మంగళవారం నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల ఏడీఏలు పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. బోర్లు, కాల్వల కింద వరి, వేరుశనగ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, మినుము వంటి పంటలు సాగు చేశారని, ఈ పంటలను శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని కోరారు. రబీ పంటలు ఆశాజనకంగానే ఉన్నాయని, చీడపీడల బెడదకు కనిపించడం లేదని ఏడీఏలు పేర్కొన్నారు. అనంతరం ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న నంద్యాల వనరుల కేంద్రం జిల్లా శిక్షణ సమన్వయకర్త జయదేవ్‌ను సత్కరించారు. నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, ఆత్మ డీపీపీ శ్రీలత పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రజలు సహకరించాలి



కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

కోడుమూరు రూరల్ : కుష్ఠు వ్యాధిపై ప్రజలంతా అవగాహన పెంచుకుని 2027సంవత్సరం నాటికి వ్యాధిని దేశం నుంచి పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలంతా సహకరించాలని వైద్యాధికారి డా.శ్రీమంత్ పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని ఈఓ అజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో వైద్యాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, బొబ్బలు రావడం వంటి లక్షణాలుంటే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి ఉన్నట్‌లైతే మల్టీ డ్రగ్ తెరపి మందులతో పూర్తిగా నయం చేయవచ్చునన్నారు. అనంతరం కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయడంతో పాటు, గోడ పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచు మాదులు, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్‌లు కమాల్ సాహెబ్, ఉమాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

కల్లూరు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో దూపాడులోని కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలలో మంగళవారం కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్పర్శలేని మచ్చలు, నరాలవాపు, వస్తువులు చేతి నుంచి జారిపోవడం, చెప్పులు కాళ్ల నుంచి జారిపోవడం వ్యాధి లక్షణాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ భాస్కర్, న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ మల్లికార్జున రెడ్డి, హెల్త్ ఆఫీసర్ శివశంకర్‌రావు తెలిపారు. రోగులపై వివక్ష చూపకూడదన్నారు. సకాలంలో గుర్తించి మందులు వాడితే పూర్తిగా కోలుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ శ్రీరామచంద్ర, డాక్టర్ రేణుక పాల్గొన్నారు.

రెండు వారాల్లో నివేదిక సమర్పించండి



సమావేశంలో కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు(సెంట్రల్): మెగా సోలార్ పవర్ కార్పొరేషన్ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి, ఖర్చుల వివరాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన మెగా సోలార్ పార్కు లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. రెండు వారాల్లోగా మెగా సోలార్‌పవర్ కార్పొరేషన్ ద్వారా చేసిన పనులపై యుటిలైజేషన్ సర్టిఫికెట్లతో సహా అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రీన్ కో, అదానీ కంపెనీల వార్షిక టర్నోవర్ ప్రకారం 2017–18 నుంచి 2023 వరకు సామాజిక బాధ్యతగా 5 శాతాన్ని లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ఫండ్‌కు కేటాయించగా..ఆ నిధులతో ఫార్మింగ్, స్వచ్ఛ భారత్, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, తాగునీటి వసతి, హంద్రీ–నీవా కాలువ శుభ్రత తదితర పనులకు వినియోగించారన్నారు. సమావేశంలో సీపీఓ హిమ ప్రభాకరరాజు, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, ఈఈ మద్దన్న, ఏపీఎస్ఐడీసీ ఈఈ లక్ష్మీనారాయణ, సోలార్ పవర్ కార్పొరేషన్ ఇంజినీర్ ఆంజనేయులు, నాగరాజు, గ్రీన్‌కో ఏజీఎం చెంచయ్య, డీఎం శివకుమార్ పాల్గొన్నారు.

డీఈఓకు ఘన సన్మానం

కల్లూరు: జిల్లా విద్యాధికారి వి.రంగారెడ్డి బుధవారం పదవీ విరణమ చేస్తున్న సందర్భంగా ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ కర్నూలు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పదవీ విరమణ సభ నిర్వహించి ఆయన్ను ఘనంగా సన్మానించారు. కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ.. విద్యారంగానికి విశిష్ట సేవలందించిన సేవలను కొనియాడారు.



డీఈఓ రంగారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న హెచ్‌ఎంలు

అసోసియేషన్ సెక్రటరీ నారాయణ, డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ కాంట్రాక్ట్ పద్ధతిలో జేజేఎం నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ

ఓర్వకల్లు: జలజీవన్ మిషన్ ద్వారా చేపడుతున్న పనులను ఇకపై కమ్యూనిటీ కాంట్రాక్ట్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు జేజేఎం ప్రాజెక్టు పర్యవేక్షణ విభాగం జిల్లా సమన్వయకర్త భీమశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్ అధ్యక్షతన జేజేఎం నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జలజీవన్ మిషన్ పనుల నిర్వహణకు గ్రామస్థాయిలో జల సంఘాలను ఏర్పాటు చేసి కమ్యూనిటీ కాంట్రాక్ట్ పద్ధతిలో పనులను నిర్వహించాలని సూచించారు. ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయిని ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీటిని అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామీణ జల సంఘం ఏర్పాటులో 9 మంది డ్వాక్రా సంఘం మహిళలు సభ్యులుగా, స్థానిక ఇంజినీరింగ్ అసిస్టెంట్ కన్వీనర్‌గా, పంచాయతీ కార్యదర్శి ఎక్స్ అఫిషియోగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సంఘం విధులు, బాధ్యతల గురించి వివరించారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య

కల్లూరు: ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. మంగళవారం కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆశా కార్యకర్తలు వైద్య శిబిరంలో చికిత్స పొందిన వారి ఆరోగ్య పరిస్థితులను గమనించాలని సూచించారు. వైద్య శిబిరానికి వచ్చిన వారందరికీ ఫోల్డర్ బ్యాగ్స్ అందించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. వీటన్నింటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలను ఆదేశించారు. డెంగీ, మలేరియా, చికున్ గునియా, ఫైలేరియా వ్యాధులు, దోమలు ప్రబలకుండా తగు జాగ్రత చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కె.మార్కాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య

వెండి పట్టీల పట్టివేత

కర్నూలు కల్చరల్: కర్నూలు నాల్గవ పట్టణ పోలీసులు 58.565 కేజీల వెండి కాళ్ల పట్టీలను తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న వెండి ఆభరణాలను మంగళవారం రాత్రి మీడియా ముందు ప్రదర్శించారు. స్టేషన్ సీఐ వివరాలను వెల్లడించారు. మంగళవారం బళ్లారి చౌరస్తా వద్ద ఒక వ్యక్తి రెండు బ్యాగ్‌లతో అనుమానాస్పందగా తిరుగుతున్నాడని సమాచారం రావడంతో ఎస్ఐ సునిల్‌కుమార్, సిబ్బందితో కలిసి అక్కడి వెళ్లామన్నారు. బ్యాగ్‌లను తనిఖీ చేయగా 9 ప్లాస్టిక్ కవర్లలో వెండి కాళ్లపట్టీలు ఉన్నాయన్నారు. అతన్ని విచారించగా తమిళనాడు రాష్ట్రం సెవ్వాపేట్ టౌన్ సాంబలింగమూర్తి నగర్‌కు చెందిన జగదీష్ (29)గా తెలిసిందన్నారు. తాను, తన తల్లి సేలం టౌన్‌కు చెందిన బంగారు షాప్‌ల వద్ద వెండిని తక్కువ ధరకు కొని ఆభరణాలుగా తయారు చేసి బిల్లులు లేకుండా కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని దుకాణాలకు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. మంగళవారం సేలం నుంచి కర్నూలు వచ్చారని పేర్కొన్నారు. బళ్లారి చౌరస్తా వద్ద బస్సు దిగి కర్నూలులోని బంగారు షాప్‌లకు వెళ్లడానికి ఆటో కోసం వేచి చూస్తుంటే పోలీస్‌లు రావడంతో పారిపోతుండగా పట్టుకున్నామని వెల్లడించారు. వాటి విలువ రూ.45.33 లక్షలు ఉంటాయని సీఐ తెలిపారు.

వ్యాధుల నివారణకు వ్యాక్సినేషన్

పాణ్యం: ప్రభుత్వ ఆదేశాల మేరకు పశుసంవర్ధకశాఖ, అటవీశాఖ సంయుక్తంగా నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతంగా ముగిసినట్లు ఆర్ఓ సుబ్బరాయుడు, పశుసంవర్ధకశాఖ ఏడీఏ కమలాకర్ అన్నారు. మంగళవారం గోరుకల్లు గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అడవికి దగ్గరగా ఉన్న గ్రామాల్లో పశువులకు ఉండే పలు రకాల వ్యాధులు ఇతర పశువులకు సంక్రమించమించకుండా ఈ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. ముఖ్యంగా బర్రెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, ఇతర జంతువులకు సుమారు 40 జంతువులకు వ్యాక్సిన్ వేశామన్నారు. దీని వల్ల అడవిలోకి వెళ్లిన తర్వాత వాటి ద్వారా ఇతర జంతువులకు వ్యాధులు సంక్రమించవన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, డీఆర్ఓ చంద్రహాస్, సర్పంచ్ ఉసేన్‌సా, ఎంపీటీసీ సభ్యుడు గణేష్, నాయకులు సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, డాక్టర్ సులోచన పాల్గొన్నారు.



గోరుకల్లులో పశువుకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజారోగ్యానికి రక్ష... ఆరోగ్య సురక్ష



గొల్లలదొడ్డి: వృద్ధుడిని ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న డాక్టర్ మిథున్ కుమార్‌రెడ్డి



హెల్త్ క్యాంప్‌లో పేరుల నమోదు చేయించుకుంటున్న ప్రజలు

సి.బెళగల్: ప్రజారోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రక్ష అని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మిథున్ కుమార్‌రెడ్డి సూచించారు. సి.బెళగల్ మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్లు ప్రజలకు ఈసీజీ, కంటి తదితర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ క్యాంప్‌లో 352 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ మిథున్ కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు భరత్, సింధూర, కంటి వ్యాధి నిపుణుడు సంపత్, వైద్య అధికారులు ఉమామహేశ్వరి, మంగమ్మ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ వర్ధంతి


సి.బెళగల్: మండలంలో గాంధీ వర్ధంతిని మంగళవారం అధికారులు, సచివాలయ ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహానికి తహసీల్దార్ శేషఫణి, అధికారులు, సిబ్బందితో పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలలో కార్యదర్శులు, సర్పంచ్‌లు గ్రామ సభలను నిర్వహించి గాంధీకి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్పర్శ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలలోని సచివాలయాలలో ఉద్యోగులు, అధికారులు, సిబ్బందితో కలిసి లెప్రసీ (కుష్ఠు) వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి నివాళులర్పించి లెప్రసీ వ్యాధి నివారణ చర్యలపై ప్రతిజ్ఞ చేయించారు.



సి.బెళగల్లో గాంధీజీకి నివాళ్లులర్పిస్తున్న తహసీల్దార్ శేషఫణి

అక్రమంగా గ్రావెల్ తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూటౌన్): కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో సర్వే నంబర్ 556/ఏలో అక్రమంగా గ్రావెల్ తవ్వి గాలిమరల మధ్య రహదారి నిర్మాణం కోసం తరలించిన అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. గోరంట్లలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో సంబంధిత ప్రాంతాన్ని మైనింగ్ అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ డీడీ మాట్లాడుతూ.. అక్రమంగా ఖనిజాన్ని తవ్వి తరలించారని, సంబంధిత ప్రాంతాన్ని తనిఖీ చేసి కొలతలు తీసుకున్నామని, తుది నివేదిక రూపొందించి అక్రమార్కులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయనతో పాటు జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న జిల్లా మైనింగ్ అధికారులు

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కర్నూలు: కర్నూలు–డోన్ జాతీయ రహదారిపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శరీన్‌నగర్‌కు చెందిన దూదేకుల ఆలం బీ (78) మృతిచెందింది. అబ్బాస్ నగర్ వైపు నుంచి శరీన్ నగర్‌కు వెళ్లేందుకు మంగళవారం ఉదయం రోడ్డు దాటుతుండగా డోన్ వైపు నుంచి కర్నూలుకు వస్తున్న బొలెరో వాహనం వేగంగా ఢీకొట్టడంతో ఆలం బీ తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సాయంత్రం మృతిచెందింది. ఈమె భర్త, కూతురు కూడా చనిపోవడంతో మనవడి దగ్గర ఉంటూ బొరుగులు అమ్ముకుని జీవనం సాగించేది. మనవడు దస్తగిరి ఫిర్యాదు మేరకు వాహన డ్రైవర్ కటారుకొండ గ్రామానికి చెందిన ఎల్లేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.



కోడుమూరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న తహసీల్దార్ జయన్న



హనుమంతరెడ్డిని అభినందిస్తున్న తహసీల్దార్

శతక్కొట్టాడు

- 42 బంతుల్లో 13 సిక్సర్లు, 6 ఫోర్లతో 110 పరుగులు
- బ్యాట్ ఝులిపించిన హనుమంతరెడ్డి
- నియోజకవర్గ స్థాయి క్రికెట్ విజేత కోడుమూరు జట్టు

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీల్లో భాగంగా కోడుమూరు బాలుర హైస్కూల్లో మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ ఫైనల్ పోటీల్లో కోడుమూరు ఆటగాడు హనుమంతరెడ్డి సిక్సర్ల మోత మోగించాడు. కేవలం 42 బంతుల్లో 13 సిక్సర్లు, 6 ఫోర్ల సాయంతో 110పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. జట్టు స్కోర్ 134 పరుగులు ఉండగా, ఇందులో హనుమంతరెడ్డి కొట్టిన పరుగులే 110 ఉండడం విశేషం. తర్వాత బ్యాటింగ్ చేసిన సి.బెళగల్ జట్టు 10 ఓవర్లలో 102 పరుగులు మాత్రమే చేసింది. పరుగులతోనే కాదు, బౌలింగ్‌లోనూ హనుమంతరెడ్డి రెండు ప్రధాన వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. అలాగే ఆడిన 7మ్యాచ్‌ల్లో 3 సెంచరీలు, 2ఆఫ్ సెంచరీలు చేసి ప్లేయర్ ఆఫ్ ద సీరిస్‌గా నిలిచాడు. హనుమంతరెడ్డిని తహసీల్దార్ జయన్న అభినందించారు. నియోజకవర్గ స్థాయి క్రికెట్ విజేతగా నిలిచిన కోడుమూరు జట్టుకు తహసీల్దార్ జయన్న ట్రోఫీని అందజేశారు. పీఈటీలు సురేంద్రనాయుడు, మహమ్మద్ రఫీ, నిక్సన్‌బాబు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.